ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6, కనిష్ఠం 24.9
నిజామాబాద్
జిల్లా వార్తలు

మంగళవారం 22 ఏప్రిల్ 2025



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేష్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం
- పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నాం
- ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగుతోంది
- ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం
- నిజాంసాగర్, శ్రీరాంసాగర్‌లో పూడికతీత పనులను త్వరలోనే మొదలు పెడతాం
- జిల్లాలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం
- రైతు మహోత్సవ సభలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్, జూపల్లి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్

రైతు సంక్షేమానికి పెద్దపీట

నిజామాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'ఇది ప్రజల ప్రభుత్వం.. ప్రజల ఆకాంక్షలు ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం. వ్యవసాయంలో ముందున్న నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు మహోత్సవ కార్యక్రమాన్ని నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఆయన సోమవారం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇబ్బందులు లేకుండా అన్నిరకాల పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన యాంత్రీకరణను తిరిగి ప్రారంభించామన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్‌తో పాటు పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడి సహకరించే విధంగా చూస్తున్నామన్నారు. నిజామాబాద్‌లోని పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి తాము సూచించామని తెలిపారు. పసుపు పారానిగా పేరున్న జిల్లా.. వ్యవసాయంలో మరింత అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన పూర్తి చేసుకొని రాగానే ఆయనతో చర్చించి జిల్లాలో వ్యవసాయ కళాశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మూడు రోజుల పాటు జరిగే రైతుమహోత్సవాన్ని రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. రైతు మహోత్సవం పేరుమీద 150 స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు.

ప్రతీ గ్రామంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

: ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం సేకరించేందుకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రాణహిత చేవెళ్ల పనులు సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. రైతు లేనిదే దేశం లేదని రైతు మహోత్సవ కార్యక్రమాలను మండలాల వారీగా నిర్వహించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఫసల్‌బీమా యోజన పథకం బీఆర్ఎస్ హయాంలో అమలు కాలేదన్నారు. ఉమ్మడి జిల్లా రైతులకు కల్లాలు లేకపోవడం వల్ల ధాన్యం నిలువ చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఎక్కడా స్థలాలు లేకపోవడం వల్ల రైతులు రోడ్లపైనే పోస్తున్నారని అన్నారు. కొనుగోళ్లు ఆలస్యం కావడం, గన్నీ బ్యాగులు దొరకకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జిల్లాల పరిధిలో ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. కొనుగోలు ఆలస్యం కావడం వల్ల అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. రైతు మహోత్సవ కార్యక్రమం విజయవంతం అయ్యే విధంగా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ఐదు జిల్లాల పరిధిలో రైతులు వచ్చి అవగాహన కల్పించే విధంగా ఈ ఏర్పాట్లను చేశామన్నారు. కళాశాల మైదానంలో 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదు జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన రైతులకు యాంత్రీకరణలో భాగంగా సబ్సిడీ చెక్కులను మంత్రులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కార్పొరేషన్ చైర్మన్‌లు తాహెర్‌బిన్ హందాన్, ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, పసుపు బోర్డు కార్యదర్శి భవాని, అదనపు కలెక్టర్‌లు అంకిత్, కిరణ్‌కుమార్‌లతో పాటు పలు శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.





● స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రులు, ఇతర ప్రముఖులు





ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం..

: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రాజెక్టులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర సాగునీటి శాఖ, పౌరసరఫరాలకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో పూడికతీత పనుల కోసం చర్యలు చేపడుతామన్నారు. ఈ నెలాఖరులోపే టెండర్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. పూడికతీత ద్వారా లక్షల ఎకరాలకు అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 20, 21, 22 పెండింగ్ పనులను త్వరలోనే చేపడుతామన్నారు.

రైతాంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంది..

: మంత్రి జూపల్లి కృష్ణారావు



రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 64 సంవత్సరాల్లో 21 మంది ముఖ్య మంత్రులు 64వేల కోట్ల రూపాయలు అప్పులు చేస్తే గత ప్రభుత్వ హయాంలో ఒక ముఖ్యమంత్రే 8లక్షల కోట్ల అప్పులు చేశారని అన్నారు. దాని ఫలితంగా ప్రస్తుతం ప్రతీనెలా 6వేల కోట్ల రూపాయలు అప్పులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సంవత్సరంన్నర కాలంలో లక్షా 40వేల కోట్లు వడ్డీల కిందనే ప్రభుత్వం చెల్లించిందన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి..

: షబ్బీర్ అలీ,



రాష్ట్రంలో వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారికి నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. గత సంవత్సరం కూడా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.10వేల చొప్పున ఇచ్చిందన్నారు. అదే రీతిలో ప్రస్తుతం ఇవ్వాలని ఆయన కోరారు. ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. కేసీఆర్ హయాంలో పనులు చేసి ప్రస్తుతం నీళ్లు లేవని మాట్లాడటం సరికాదన్నారు.

పెట్టుబడి తగ్గించి దిగుబడిని పెంచాలి..

: పోచారం శ్రీనివాస్‌రెడ్డి



రైతులు పెట్టుబడి ఖర్చును తగ్గించి దిగుబడి పెంచే విధంగా చూడాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆయన అన్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు ఆలోచించడంతో పాటు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులను అప్పుల నుంచి బయటపడవేసి పెట్టుబడికి మళ్లీ అప్పులు లేకుండా అభివృద్ధి చెందే విధంగా చూడాలని ఆయన అన్నారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం..

: పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు పూర్వ వైభవం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేస్తామని అన్నారు. జిల్లాకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల అభివృద్ధి కోసం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకోవాలని కోరారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ప్యాకేజీ పనులు 20, 21, 22 పూర్తి చేయాలని ఆయన కోరారు. నిజాం నవాబు.. నిజాంసాగర్ ప్రాజెక్టును నిర్మించారని ఈ ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం అయ్యిందని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి రైతులు ఇక్కడికి వచ్చి భారీగా పంటలు పండించారని తెలిపారు. మనకు పంటలు పండించే విధానం నేర్పారన్నారు. నిజాం వారిని ఇక్కడికి తీసుకొచ్చారన్నారు.

నేడు ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను మధ్యాహ్నం 12గంటలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో విడుదల చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 36,222 మంది విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశారు. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించారు. గతఏడాది ఇంటర్ ఫలితాలలో జిల్లా 60శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రథమ సంవత్సరంలో 51 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 16వ స్థానంలో నిలువగా ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 60శాతం ఉత్తీర్ణత సాధించి 15వ స్థానంలో నిలిచింది.

పంచాయతీ రాజ్ శాఖలో ఏసీబీ అధికారుల దాడి

● లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్



సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ శర్మ

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. పంచాయతీ రాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.శ్రీనివాస్‌శర్మ రూ.7వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తన సిబ్బందితో కలిసి రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. డొంకేశ్వర్ మండలంలోని ఓ కాంట్రాక్టర్ సీసీ రోడ్డు పనుల పాత బిల్లులు రూ.4లక్షల 70వేలు బిల్లులు చేయాల్సిందిగా సీనియర్ అసిస్టెంట్ ఎన్. శ్రీనివాస్‌ను సంప్రదించగా.. రూ.7వేల500 లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు రూ.7వేలకు ఒప్పందం కుదుర్చుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారి ప్రణాళిక ప్రకారం కార్యాలయంలో రెడ్‌హ్యాండ్‌గా పట్టుకుని నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు శ్రీనివాస్, నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

యంచలో గంజాయి పట్టివేత

30 కేజీల 250 గ్రాముల గంజాయి స్వాధీనం

● ఐదుగురి అరెస్టు ● కారు, మూడు ద్విచక్ర వాహనాల సీజ్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. నవీపేట మండలం యంచ చెక్‌పోస్టు వద్ద సుమారు 6లక్షల విలువగల 30 కేజీల 250 గ్రాముల గంజాయిని పట్టుకొని ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆదివారం గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న పక్కా సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం యంచ చెక్ పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా 30 కేజీల 250 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని తెలిపారు. మొదట నిజామాబాద్ ఆటోనగర్‌కు చెందిన మహమ్మద్ యూబ్‌ను పట్టుకోగా అతని వద్ద సుమారు 200 గ్రాముల గంజాయి దొరికిందని, అతన్ని విచారణ చేపట్టి మిగతా వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మిగతా నలుగురు ఖురీషి, ఫయీమ్, సిద్ధిఖి, పటాన్‌లు మహారాష్ట్రలోని బోకర్‌కు చెందిన వారు అన్నారు. వీరు ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని మహారాష్ట్రకు తీసుకువచ్చి అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి తీసుకువస్తారన్నారు. వీరి వద్ద నుంచి షిఫ్ట్ డిజర్ కారును, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న, ఎస్సై రామ్‌కుమార్‌లను డీసీ సోమిరెడ్డి అభినందించారు.



'ప్యాకేజీ' పనులు ముందుకు సాగేనా?

- 21, 22 ప్యాకేజీ పనులకు రూ.22 కోట్ల కేటాయింపు
- నిధులు లేక 8 ఏళ్లుగా నిలిచిన ప్యాకేజీ పనులు
- ఇటీవల కాళేశ్వరం ప్యాకేజీ పనులపై సమీక్షించిన ప్రభుత్వం

కామారెడ్డి,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్ ప్రాంతాల్లోని రైతాంగానికి సాగునీరు అందించేందుకు చేపడుతున్న కాళేశ్వరం 21,22 ప్యాకేజీ పనులకు 8 ఏళ్లుగా నిధులు లేక ముందుకు సాగడంలేదు. ఇటీవల హైదరాబాద్‌లోని జలసౌదాలో 21, 22 ప్యాకేజీ పనులపై ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులతో నీటిపారుదల శాఖ అధికారులతో ఆ శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్షించి పనులకు సంబంధించి నివేదిక కోరారు. పనులు ముందుకు సాగాలంటే కాలువల తవ్వకాలు, రిజర్వాయర్ నిర్మాణం, భూ సేకరణకు రూ.23 కోట్ల నిధులు అవసరమని నివేదించారు. దీంతో ప్రభుత్వం ప్యాకేజీ పనులు చేపట్టేందుకు రూ.22 కోట్ల నిధులను కేటాయించింది.

నత్తనడకన పనులు

జిల్లాలో పది సంవత్సరాల క్రింద మొదలైన కాళేశ్వరం 22 వ ప్యాకేజీ పనులు ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. సదాశివనగర్ మండలం భూంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తీసుకురావడానికి నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం అమ్రాద్ కోండెం చెరువు నుంచి 1.9 కిలోమీటర్ల మేర అప్రోచ్ కెనాల్ తవ్వాల్సి ఉంది. అందులో భాగంగానే 5.5 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు చేపట్టారు. ప్రస్తుతం అప్రోచ్ కాలువ తవ్వడమే పూర్తయింది. కేవలం 450 మీటర్ల మేర టన్నెల్ తవ్వకాలు జరిపి వదిలేశారు. అదేవిధంగా భూంపల్లి వద్ద 1.5 టీఎంసీలతో నిర్మాణం చేపడుతున్న రిజర్వాయర్ పనులు సైతం పునాదులకే పరిమితమయ్యాయి. ఐదు సంవత్సరాల క్రిందట రిజర్వాయర్ అలుగు నిర్మాణం కోసం పునాదులు తవ్వి బెస్మిట్ వేశారు.భూంపల్లి రిజర్వాయర్ వద్ద సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయడంతో పాటు నిధులు విడుదల చేసింది. ఈ సబ్‌స్టేషన్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగితా పనులన్ని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నమాదిరిగా ఉంది.

రూ.400 కోట్లు అవసరం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాళేశ్వరం పథకం కింద చేపడుతున్న ప్యాకేజీ 21,22 పనులు పూర్తికావాలంటే రూ.400కోట్లు అవసరమని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. రూ.400కోట్లు కేటాయించి నిజామాబాద్ జిల్లాలో మంచిప్ప జలశయం వద్ద భూ సేకరణ సమస్యను పరిష్కరించి ప్యాకేజీ 21,22 పనులను అనుసంధానిస్తే సదాశివనగర్ మండలం భూంపల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించ వచ్చు. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తిచేసేందుకు ఇటీవల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని జలసౌదాలో సమీక్షించారు. సమీక్ష నిర్వహించి ఎంతమేర నిధులు అవసరమవుతాయో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో అధికారులు రూ.400 నుంచి రూ.500 కోట్ల వరకు కేటాయిస్తే పనులు పూర్తవుతాయని నివేదించారు. ప్రస్తుతానికైతే రూ.23కోట్ల నిధులను విడుదలచేస్తే కాలువల తవ్వకాలు, భూసేకరణ రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి చేయవచ్చని నివేదించారు. దీంతో ప్రభుత్వం ప్యాకేజీ పనులు చేపట్టేందుకు రూ.22 కోట్లను కేటాయించింది.

ఇప్పటివరకు పనులు ఇలా

కామారెడ్డి, మెదక్ జిల్లాలకు సాగునీరు అందించేందుకు 22వ ప్యాకేజీ పనులను జిల్లాలో చేపడుతున్నారు. సదాశివనగర్ మండలం భూంపల్లి రిజర్వాయర్ నుంచి 100.80 కిలో మీటర్ల మేరకు కాల్వలు తవ్వాల్సి ఉంది. ఇందులో ఎడమ కాలువ 51 కిలోమీటర్లు, కుడి కాలువ 11.975 కిలో మీటర్లు, ప్రధాన కాల్వ 14.25 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. ప్రధాన కాలువ(రిడ్జ్‌కాలువ) దాదాపు పనులు పూర్తయ్యాయి. కుడికాలువ (ఆర్ ఎంసీ) తుది దశకు చేరుకుంది. ఎడమకాల్వ (ఎల్ఎంసీ)కు సంబంధించి భూ సేకరణ పనులు కొలిక్కి వచ్చాయి. ఈ కాలువలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని 21వ ప్యాకేజీ నుంచి సోరంగమార్గం ద్వారా భూంపల్లి రిజర్వాయర్ వరకు 7.560 కిలో మీటర్ల వరకు కాలువ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ సోరంగ మార్గ పనులు మాత్రం పూర్తి కావడం లేదు.

వక్ఫ్ బోర్డు దేశానికి ప్రమాదంగా మారింది : ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు దేశానికే ప్రమాదకరంగా మారిందని వక్ఫ్ ఆస్తులు దుర్వినియోగం అవుతున్నాయని ఎమపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు పేద ముస్లింల కోసం పనిచేయడం లేదని అన్నారు. 1995లో ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు చేసిన గనకార్యం వల్లనే వక్ఫ్ బోర్డుకు జుడీషియల్ పవర్ ఇచ్చారని దీంతో వక్ఫ్ ఆస్తులు పెరిగాయని అన్నారు. 2013లో ఎన్నికలకు ముందు సోనియాగాంధీ సుప్రీం కోర్టుకు వెళ్లకుండా జుడీషియల్ పవర్ ఇచ్చారని అన్నారు. వక్ఫ్ ఆదాయం గతంలో సంవత్సరానికి 162 కోట్లకు పైగా ఉంటే ప్రస్తుతం 92లక్షలకు పడిపోయిందన్నారు. భారతదేశంలో మూడో అతిపెద్ద భూమి ఉన్న బోర్డు వక్ఫ్ బోర్డు అన్నారు. హైదరాబాద్‌లో 82 శాతం వక్ఫ్ ఆస్తులు పెద్దల చేతుల్లోనే ఉన్నాయన్నారు. చార్మినార్ ప్రాంతంలో ఒక్క మడిగె కిరాయికి ఇస్తే లక్షలు వస్తాయని కానీ వక్ఫ్‌బోర్డుకు చెల్లించేది మాత్రం రూ.500 నుంచి రూ.1000 మాత్రమే అన్నారు. మిగతా డబ్బులు ఓవైసీ చేతుల్లోకి వెళ్తున్నాయని అన్నారు. వక్ఫ్ ఆస్తులను ఓవైసీ ఒక్కడే కాకుండా కాంగ్రెస్‌లో ఉన్న పెద్ద ముస్లింలు కూడా మింగుతున్నారని అన్నారు. సుమారు 10వేల ఎకరాలకు పైగా ఆస్తులు వక్ఫ్‌కు ఉన్నాయన్నారు. 1995 తర్వాత 2013 తర్వాత వక్ఫ్ భూములు దుర్వినియోగం అయ్యాయని అన్నారు. 2006లో 6లక్షల ఎకరాలు వక్ఫ్ బోర్డు ఆస్తులు ఉండేవని 2025 తర్వాత వక్ఫ్ బోర్డు ఆస్తులు 38లక్షల ఎకరాలకు క్లైమ్ చేస్తున్నారని అన్నారు. వీటి ద్వారా వచ్చే ఆదాయం కేవలం 9లక్షలు మాత్రమేనన్నారు. వక్ఫ్ బోర్డులో పెద్దలు మాత్రమే దోచుకుంటున్నారని పేద ముస్లింలకు, మైనార్టీలకు వక్ఫ్ చేసిందేమి లేదన్నారు. వక్ఫ్ చట్టసవరణకు వ్యతిరేకంగా ర్యాలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. టీటీడీ సంస్థ తన సొంత ఖర్చులతో గుడులను కడుతుందన్నారు. పసుపు బోర్డు కార్యాలయం కోసం ఖాళీగా ఉన్న రూరల్ క్యాంప్ భవనాన్ని ఇవ్వాలని రెండు నెలలుగా దరఖాస్తు చేసుకున్నా స్పందించడం లేదని అన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బోధన్‌లో ఫోర్‌లైన్ రోడ్లను మంజూరు చేస్తే రెండు లైన్‌లే అవసరం అని లెటర్ రాశారని తెలిపారు. మాధవనగర్ బ్రిడ్జి కోసం నల్లమట్టి ఉందని 8 కోట్లు అదనంగా కాంట్రాక్టర్ అడిగితే ఇవ్వకపోవడంతో రెండు లైన్‌లే కడతానని కాంట్రాక్టర్ అంటున్నారని దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



బెల్లాల్‌లో కాలువను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్ రూరల్,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. సోమవారం బెల్లాల్ చెరువు నుండి బోధన్‌కు సరఫరా అయ్యే కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా బెల్లాల్‌లో నీటి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పట్టణంలో తాగునీటి పైపులు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. లీకేజీలు ఉన్నట్లయితే వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. ఆయన వెంట బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, డీఈ యోగేష్, వాటర్ వర్క్స్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

● సొసైటీలో ఎందుకు అమ్ముతున్నారు, బయట అమ్ముకోండి
● సహకార సంఘం క్లర్క్ ఉచిత సలహా



అంబంలో ధర్నా చేస్తున్న గ్రామ రైతులు

ఎడపల్లి, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):వరి ధాన్యం కొనుగోలు చేయాలంటూ సోమవారం అంబం గ్రామ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎడపల్లి మండలంలోని అంబం గ్రామం బోధన్ మండలం పెంటాకలాన్ సహకార సంఘం పరిధిలోకి రావడంతో తమకు ప్రతి ఏటా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వరి పంట కోసి 20 రోజులు అయినా ఇప్పటి వరకు వరి ధాన్యం కొనుగోలు చేయక పెంటాకలాన్ సహకార సంఘం సిబ్బంది నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.బార్దాన్ అడిగితే 50 వంద బస్తాలు ఇస్తున్నారన్నారు. ధాన్యం బస్తాలు నింపి 5 రోజులు అయినా ఇప్పటి వరకు తూకం చేయలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదేమని సహకార సంఘం కార్యదర్శి బాబాను అడగగా తాను ఏమి పట్టించుకోవడం లేదన్నారు. ఏకంగా సహకార సంఘం క్లర్క్ అయితే 'సహకార సంఘం కొనుగోలు కేంద్రాల్లో ఎందుకు అమ్ముతున్నారు, బయట అమ్ముకోండ్రి' అంటూ ఉచిత సలహా ఇస్తూ మేము ఎప్పుడు నింపాలో మాకు తెలుసు మీరు ఎవరికి చెబుతారో చెప్పుకోండ్రి అంటూ రైతులను బెదిరిస్తున్నారని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి అంబం గ్రామ రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ ధర్నాలో రైతులు ఒడ్డెన్న, హరికృష్ణ, లక్ష్మయ్య, సుధాకర్, రమేష్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

గర్భిణీ, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి

● జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ



మాట్లాడుతున్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి

నవీపేట,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణీ స్త్రీలు, బాలింతలతో పాటు చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణీ స్త్రీలు ఆకుకూరలు, కాయకూరలతో పాటు ఇతర పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకుంటే పుట్టబోయే బిడ్డ మంచి ఆరోగ్యవంతంగా ఉంటారని ఆమె పేర్కొన్నారు. పుట్టిన పిల్లలు వయసు తగ్గ బరువు ఉండే విధంగా చూడాలని అప్పుడే పిల్లలు ఆరోగ్యంతో పాటు మంచి తెలివితేటలతో పెరిగే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని ప్రాథమిక విద్యలో చేరడానికి వెళ్లే చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతం, పలువురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కోటగిరి: గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఆయుర్వేదిక్ వైద్యురాలు రాధిక సూచించారు. పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భం దాల్చిన రోజు నుండి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు వెయ్యి రోజులు గోల్డెన్ డేస్ అని పేర్కొన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేశారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, ఎంపీడీవో చందర్, యోగా టీచర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు కల్పన, బాలలక్ష్మి, ప్రియ, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

● రుద్రూరులో పోషణ పక్వాడ

రుద్రూరు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. యునానీ వైద్యధికారి రాఘవేందర్ రావుమాట్లాడుతూ గర్భిణీలకు రక్తహీనత, న్యూట్రిషన్స్, ఆయుష్ రెమడీస్, యోగా ద్వారా లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో శ్రీనివాస్, ఏఎన్ఎం గౌరి శిరీషా తదితరులు పాల్గొన్నారు.

వర్ని: మహిళలు గర్భిణీగా ఉన్నప్పటి నుంచి తల్లీ పుట్టబోయే బిడ్డ వరకు ఆరోగ్య సంరక్షణకు పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి పిలుపునిచ్చారు. సోమవారం వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. థౌజండ్ డేస్, గోల్డెన్ డేస్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎస్‌పీ‌ఈ జీవన జ్యోతి, సునీత, నిశిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలకు ప్రమాద బీమా పాలసీ

కోటగిరి,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలో సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీజేపీ కార్యకర్తలకు ఉచిత ప్రమాద భీమా సౌకర్యాన్ని ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ కల్పించారు. తన సొంత నిధులతో ప్రతి కార్యకర్తకు ప్రమాద భీమా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ కార్యకర్తలకు మనోధైర్యంతో పాటు భరోసా కల్పించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు. పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చిన తనను సంప్రదిస్తే సంబంధిత కుటుంబాలను ఆదుకునేందుకు తనవంతు సాయం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరి నర్సింగ్, రాజు పటేల్, గంగాధర్, సురేష్, నయీమొద్దీన్, నాగనాథ్ పటేల్, శ్రీనివాస్ పటేల్, భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు మహోత్సవానికి తరలి వెళ్లిన నాయకులు

మోర్తాడ్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన రైతు మహోత్సవం వల్ల రైతులు అనేక విషయాలపై ప్రత్యక్షంగా అవగాహన చేసుకుంటారని మండల వ్యవసాయ అధికారి హరీష్ అన్నారు. సోమవారం మండలం నుంచి జిల్లా కేంద్రం లోని జీజీ కాలేజీ గ్రౌండ్‌నందు ఏర్పాటు చేసిన రైతు మహోత్సవానికి మండలం నుంచి రైతులు తరలివెళ్లారు. కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాల్లు , అధునాతన సాంకేతిక పద్దతులు, నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, యంత్ర పరికరాలు తదితర ఉపయోగా వంటి ఎన్నో అంశాలు తెలుసుకోవచ్చని అన్నారు. రైతులతో పాటు ఏవో హరీష్, ఏఈవోలు రంజిత్, లక్‌పతి, శ్రీలత, మహేష్ తరలివెళ్లారు.

● మోర్తాడ్ రైతులు ఏర్పాటు చేసిన కేంద్రీయ పంటల సాగు

మోర్తాడ్:జిల్లాలోని జీజీ కాలేజ్ మైదానంలో జరిగిన మహోత్సవంలో మోర్తాడ్‌కు చెందిన ఆర్గానిక్ మహిళ రైతు లక్ష్మీపటేల్ జొన్న, పసుపు పంటలను కేంద్రీయ పద్ధతిలో పండించి సందర్శకుల కోసం ఏర్పాటు చేసింది. ఎఫ్‌పీవో తరపున 11వ స్టాల్‌లో పసుపు, జొన్న పంటలను ప్రదర్శించగా పల్లె గంగారెడ్డి, కార్యదర్శి భవాణీ శ్రీ ఆర్గానిక్ పద్ధతిలో పండించిన పసుపును పరిశీలించారు. పసుపులో కరోప్యూమిన్ పర్సెంట్ బాగుందని అన్నారు. ఈ పసుపును కొనుగోలు చేయడానికి కేరళ నుంచి కొనుగోలు దారులను రప్పిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్గానిక్ ఫార్మస్ లక్ష్మీపటేల్, రైతులు లక్ష్మీనర్సయ్య, ఒల్లెం సంతోష్, టక్కురి మనోజ్, టక్కురి గంగాధర్, వర్ష పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: జిల్లా కేంద్రంలో గిరిరాజ్ కళాశాల మైదానంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న రైతు మహోత్సవం కార్యక్రమానికి కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్లారు. కాగా నాయకులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మండలపార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య కాంగ్రెస్ నాయకులతో పాటు రైతులు రైతుమహోత్స కార్యక్రమానికి తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.



స్టాల్‌లో పసుపు, జొన్నలలను పరిశీలిస్తున్న జాతీయ పసుపుబోర్డు చైర్మన్

సిరికొండ: నిజామాబాద్‌లో జరిగిన రైతు మహోత్సవానికి సిరికొండ నుంచి రైతులు బస్సులో తరలివెళ్లారు. నిజామాబాద్ పట్టణంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో జరిగిన రైతు మహోత్సవానికి మండలానికి చెందిన రైతులు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తరలివెళ్లారు.పెద్దవాల్గోట్,చిన్నావాల్గోట్, రామడుగు, సిరికొండ,మైలారం తదితరగ్రామాలకు చెందిన రైతులు వెళ్లిన వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన బంజ విశ్వనాథ్ (47) జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మైనర్ బాలుడు భానుప్రసాద్ మృతి చెందగా తీవ్ర గాయాలైన బంజ విశ్వనాథ్, కుమారుడు ఓంకార్‌లను పోలీసులు ఆసుపత్రికి తరలించగా ఆర్మూర్ ఆసుపత్రిలో ఓంకార్ మృతి చెందాడు. మెరుగైన చికిత్స కొరకు విశ్వనాథ్‌ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ విశ్వనాథ్ మృతి చెందాడు.

తండ్రి, కొడుకుల అంత్యక్రియలు:పెర్కిట్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి విశ్వనాథ్, కుమారుడు ఓంకార్‌లు మృతి చెందగా కాలనీ ప్రజల రోధనలు మిన్నంటాయి. ఓ వివాహ వేడుకకు వెళ్తున్న తండ్రి, కొడుకు బైక్‌పై రోడ్డు దాటుతుండగా లారీ ఢీ కొట్టడంతో మృత్యుఒడిలోకి పోయారు. దీంతో ఆదివారం సాయంత్రం నుండి రోధనాలు మిన్నంటాయి. తండ్రి విశ్వనాథ్, కొడుకు ఓంకార్‌ల అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు, కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు.

● పలు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శ

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని పలు కుటుంబాల ను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఇటీవల పట్ట ణంలోని హుస్నాబాద్ కాలనీలో గుండెపోటుతో సిద్దాపురం చిన్నరాజేశ్వర్ మృతి చెందారు. పెద్దబజార్‌లో కటికె మస్కట్ గంగారాం అనారోగ్యంతో మృతిచెందారు. అలాగే అశోక్‌నగర్ కు చెందిన బంజ విశ్వనాథ్, కుమా రుడు ఓంకార్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్టాల సుమన్, మాజీ కౌన్సిలర్ ఆకుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, కలిగోట ప్రశాంత్, కొడిగెల సుధాకర్, మిర్యాల్‌కర్ కిరణ్, బోడమిది నవీన్ తదితరులు ఉన్నారు.

పోచంపల్లిలో బడిబాట కార్యక్రమం

వేల్పూర్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామంలో సోమవారం అంక్సాపూర్ , పోచంపల్లి పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల సౌకర్యాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా మెరుగైన విద్యబోధన అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్రభుత్వ పరంగా సన్నబియ్యంతో మధ్యాహ్న బోజనం, రెండు జతల దుస్తువులు, పాఠ్యపుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ పాఠశాలల్లో 10 తరగతి విద్యార్థులకు ట్రిబుల్ ఐటీలో అడ్మిషన్లు లభిస్తాయని అన్నారు. పోచంపల్లి గ్రామస్థులు పర్యావరణ పరిరక్షణలో ముందున్నారని అదే విధంగా బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం గ్రామ విడిసి ఆధ్వర్యంలో జరుగుతున్న సమావేశంలో ఉపాధ్యాయులు హాజరై ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మల్లీశ్వరి, రఘునాథ్, వినోద్, శ్రీదేవి, శ్రీలక్ష్మీ, యమున తదితరులున్నారు.

నవీపేట: ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండలంలోని నాడాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత కోరారు. సోమవారం బడిబాటలో భాగంగా గ్రామంలో ఉపాధి కూలీ పనులు నిర్వహిస్తున్న తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో రాజు, మల్లేష్, శరత్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



పోచంపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మోపాల్:బయట తిరుగుతున్న బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేర్పించారు. మండలంలోని కంజర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం గ్రామంలోని వీధులగుండా తిరిగి బడికి వెళ్లకుండా బయట తిరుగుతున్న పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పేదల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలను తప్పకుండా బడిలో చేర్పించాలని కంజర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌చారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌లక్ష్మీ, అరుణశ్రీ, రాణి, గోపాలకృష్ణ, శాంతికిరణ్, ఉమాగౌరీ, భూమయ్య, విజయలక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి



మహిళ సంఘాలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఐకేపీ సీసీ పురస్తు నరేష్ సూచించారు. సోమవారం మండలంలోని పురానిపేట్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు నెలనెల మీటింగ్‌లు పెట్టుకుని ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి తీర్మానాలు చేసుకోవాలని, శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీవోలు, వివోఏలు, మహిళల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతులకు ఆంధ్రవారు వ్యవసాయం నేర్పించారనడం సరికాదు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రైతులకు వ్యవసా యం చేయడం ఆంధ్రప్రాంతం వారు నేర్పించారని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడడం సరికాదని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. ఆయన అలా మాట్లాడడం యావత్ తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు మహోత్సవ వేడుకలు నిర్వహించడం విడ్డురంగా ఉందన్నారు. నాడు తెలంగాణ ఏర్పాటుకు అడ్డుపడ్డ సమైక్య పాలకుల అడుగులకు మడుగులొత్తిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు సొంత రాష్ట్రంలో ఉన్నామన్న విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. అనేక ఏళ్లక్రితమే దక్కన్ ప్రాంతంలో సన్నబియ్యం పండించిన చరిత్ర తెలంగాణ రైతులదేనన్నారు. వ్యవసాయ రంగంలో నిష్ణాతులైన తెలంగాణ రైతులను అవమానించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తెలంగాణ సమాజానికి బేషర తుగా క్షేమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుస్నాబాద్ కాల నీలో పలువురు లబ్ధిదారులకు సోమవారం మాజీ కౌన్సిలర్ ఆకుల సంగీత శ్రీనివాస్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్‌లో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కోటగిరి,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని సిద్దాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతశ్రీ విభూషిత జగద్గురు రామానంద చార్య శ్రీ స్వామి నరేంద్ర చార్యజీ ట్రస్టు ద్వారా విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అనిత, సంగీత, జయశ్రీ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు విఠల్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీలత, లలిత తదితరులఉ పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మోర్తాడ్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో కొమిరె సాయిలు (55) సోమవారం వేకువజాములో ఇంటిలో అనుమానాస్పదంగా మరణించారని భీమ్‌గల్ సీఐ పి. సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి సమయంలో ఇంటికి మద్యం తాగివచ్చి భార్య వెంకటమ్మ, కూతురు లతలతో గొడవ పడినాడని తెలిపారు. అర్ధరాత్రి 12 గంటలకు మూత్రవిసర్జన కొరకు వెళ్లి మద్యం మత్తులో గోడకు గుద్దుకోగా తల ఎడమవైపుకు గాయం అయ్యిందని భార్య వెంకటమ్మ, కూతురు లత లు అతడిని ఇంటిలో పడుకోబెట్టి ఉదయం 4 గంటలకు లేసి చూసే సరికి సాయిలు చనిపోయాడని సీఐ తెలిపారు. బాలానగర్ గ్రామానిఇక చెందిన కొమిరె సాయిలు అన్న కొమిరె నడ్పి సాయిలు ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టంకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్సై తెలిపారు.

భార్యనే హత్య చేసింది: ఇదిలా ఉండగా గ్రామస్థుల కథనం మేరకు భర్త సాయిలును వెంకటమ్మ, కూతురు లతలు కలిసి హత్య చేశారని గ్రామస్థులు బహిరంగంగా అంటు న్నారు. గతంలో కూడా కొన్నిసార్లు హత్య ప్రయత్నాలు చేశారని తెలిసింది. గ్రామస్థులు మాత్రం సాయిలుది ముమ్మాటికి హత్యేనని అంటున్నారు.

భూమికోసం మహిళ రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న మహిళలు

మోర్తాడ్,ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పులి సుగుణసోమ వారం నుంచి మండల తహసీల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టింది. ఆమెకు మద్దతుగా ఇతర మహిళలు కూడా నిరాహార దీక్షలో పాల్గొన్నారు. సుగుణకు చెందిన సర్వే నంబర్ -12, 13 ఏ, 12,13బి లో గత 40 సంవత్సరాలుగా కబ్జాలో ఉండి పంటలు పండించుకుంటు న్నామని మహిళ తెలిపింది. కాగా అక్రమంగా 0.51, 1-2 గుంటల భూమిని పులిరాజన్న అక్రమంగా చట్టవిరుద్దంగా తమ పాస్‌బుక్కులో ఎక్కించుకు న్నారని మహిళ ఆరోపించింది. ఈ విషయంపై పలు సంవత్సరాలుగా అధికారుల చుట్టు తిరిగిన ఆక్రమించుకున్న భూమిని పంచనామ, ఎంజాయ్ మెంట్ సర్వే యొక్క నకల్ కాపీలు ఇప్పించాలని కోరిన పట్టించుకోలేదని సుగుణ ఆరోపించింది. ఇప్పటికైన మాకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని అప్పటి వరకు రిలే నిరాహార దీక్ష చేపడుతామని బాధితురాలు తెలిపింది.

న్యాయాధికారుల సేవలు విశిష్టమైనవి



బదిలీపై వెళ్తున్న న్యాయాధికారికి మెమోంటో అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):బోధన్ కోర్టులో న్యాయమూర్తులు అందించిన విశిష్ట సేవల గురించి సోమవారం న్యాయవాదులు ప్రశంసలతో కొనియాడారు. సోమవారం బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ న్యాయమూర్తులను సన్మానించారు. బదిలీపై వెళ్తున్న 5వ అదనపు న్యాయాధికారి రవికుమార్, సీనియర్ సివిల్ జడ్జి దేవన్ అజయ్‌కుమార్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్, మొదటి శ్రేణి అదనపు న్యాయమూర్తి సాయిశివ, రెండవ తరగతి స్పెషల్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి, ఉపాధ్యక్షుడు వీఆర్ దేశాయ్, సంయుక్త కార్యదర్శి అక్తర్ పాషా, కోశాధికారి కోటేశ్వర్ రావు, క్రీడ సాంస్కృతిక న్యాయవాది డాక్టర్ సమ్మయ్య, గ్రంథాలయ కార్యదర్శి ఆరీఫోద్దీన్‌లతో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బడుల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు చేయూతనందించాలి



హసాకొత్తూర్‌లో ట్విన్నింగ్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 21: (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దడానికై ఎన్నో సదుపాయాలను, సౌకర్యాలను కల్పిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నదని. అదేతీరున ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు చేయూతనందివ్వాలని కమ్మర్‌పల్లి మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు. సోమవారం మండలంలోని హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల సమ్మేళనం అనే ట్విన్నింగ్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, సదుపాయాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. నూతన విద్యా సంవత్సరంలో 5వతరగతి చదివే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే ప్రధాన లక్ష్యాంగా ట్విన్నింగ్ అనే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం,యూనిఫామ్‌లు, అందు బాటులో ఉన్నాయని, నాణ్యమై విద్యాబోధన కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లల బంగారుభవిష్యత్తు దృష్ట్యా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తూ బడుల బలోపేతానికి తమవంతు చేయూతనందివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సతీష్, గ్రామంలోని పభుత్వ ఉన్నత, ప్రాథమిక, కమ్మర్‌పల్లి ఉర్దూమీడియం పాఠశాల, మారుతీనగర్ పాఠశాల విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, సతీష్, రిఫామిర్జా, ఉపాధ్యాయులు అంజత్ సుల్తాన్, పసుపుల ప్రసాద్ విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పదోతరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 21:(ఆంధ్రజ్యోతి) మండలంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు సోమవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమన్ని నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం ద్వార నిర్వహింపబడే పాలిటెక్నిక్ కళాశాలలలో చేరడంద్వార మూడు సంవత్సరాల్లో ఇంజనీరింగ్ విద్యతోపాటు ఆదిపొందేఅవకాశాలు ఉంటాయని, లేదా రెండో సంవత్సరం ఇంజనీరింగ్ కళాశాలలో చేరవచ్చని, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్, కమర్షియల్ ప్రాక్టీస్, ఆటోమొబైల్, మైనింగ్ మెటాలాజికల్, టుక్స్‌టైల్, కెమికల్ మొదలగు కోర్సుల్లో చేరితే తక్కువ సమయంలో ఉపాధి పొందవచ్చునిరా రోర్స్ పర్సన్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సన్నదంద కావడానికి హెచ్ఎం రాంప్రసాద్ స్టడీమెటీరియల్ ను విద్యార్థులకు అందజేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):మంజీర సరిహద్దు గ్రామంనుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.మందర్నా గ్రామం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు.వారి వద్ద ఎటువంటి ప్రభుత్వఅనుమతులు లేవన్నారు.ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సమయపాలన పాటించి ఇసుక తరలించాలన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న ఉదయం 9గంటల సమయంలో నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ చందన్ కుమార్ సమాచారం ప్రకారం.. కిలో మీటర్ నంబరు 476.1 వద్ద ఘనపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఆత్మహత్యా చేసుకోవాలనే ఉద్దేశ్యంతో గూడ్స్ రైలుకు అడ్డుగా వెళ్లడంతో రైలు ఢీకొని తీవ్రంగా గాయపడగా 108అంబులెన్స్ లో చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు ఆదివారం రాత్రి శ్రీనివాస్ మృతి చెదినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఆయన పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

ముప్కాల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన ఏలేటి గంగాధర్ పురుగుల మందు తాగి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గంగాధర్ గత కొన్ని రోజులుగా మానసికంగా బాధపడే వాడని ఆయనకు కల్లుతాగే అలవాటుందన్నారు. ఇటీవల గ్రామస్థులతో కలిసి తిరుమలకు శ్రీవారి సేవకు వెళ్లాడు. ప్రతీరోజు కల్లుతాగే అలవాటున్న ఆయనకు అక్కడ కల్లు లభించకపోవడంతో ఇటీవల స్వగ్రామానికి చేరుకొని మానసిక ఆందోళనకు గురై పురుగుల మందుతాగగా ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రైయివేట్ ఆసుపత్రికి తరలించారు.అక్కడచికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారన్నారు. మృతుని భార్యఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బోధన్‌రూరల్,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రైల్వేగేటు దగ్గర సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితి పడిపోతే స్థానికుల సమాచారం మేరకు బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించగా అతడు మృతి చెందాడని వైద్యులు చెప్పారని పేర్కొన్నారు. అతడి చేతిపై జైహనుమాన్, రమేష్ అని రాసి ఉందన్నారు. ఎవరైనా వివరాలు తెలిస్తే బోధన్ పోలీసులకు సమాచారం తెలియజేయాలన్నారు. మృతదేహం జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో ఉందన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

ఆలూర్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో ఎంపీడీవో గంగాధర్ పర్యటించడం జరిగింది. ఇందులో భాగంగా సానిటేషన్ పనులు, తాగునీటికి సంబంధించిన పనులను పరిశీలించారు. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇలాంటి సమయంలో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి కిషోర్‌కు ఆదేశించారు.



గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌లో ల్యాండ్ అవుతున్న హెలిక్యాప్టర్

అధికారుల సమన్వయలోపం

- గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌లో ల్యాండ్ అయిన హెలిక్యాప్టర్
- కూలిన రైతు మహోత్సవం స్వాగత తోరణం
- హెలిక్యాప్టర్ గాలి తాకిడికి ఇబ్బందులు పడ్డ స్టాళ్ల నిర్వాహకులు

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతు మహోత్సవ కార్యక్రమం సందర్భంగా జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో అకస్మాత్తుగా మంత్రులు ప్రయాణిస్తున్న హెలిక్యాప్టర్ ల్యాండ్ కావడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. జిల్లా కలెక్టరేట్‌లో ల్యాండ్ కావాల్సిన హెలిక్యాప్టర్ సమన్వ య లోపం కారణంగా రైతుమహోత్సవ కార్యక్రమం జరుగుతున్న గిరిరాజ్ కళాశాల మైదానంలో ల్యాండ్ కావడంతో హెలిక్యాప్టర్ తాకిడికి రైతు మహోత్సవ స్వాగత తోరణంతో పాటు పలు స్టాల్స్ పడిపోయాయి. పోలీసులు తనిఖీలు చేస్తున్న సామగ్రితో పాటు స్వాగత తోరణం ఒక్కసారిగా కిందపడటంతో అక్కడే ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. జిల్లా అధికారులంతా కలెక్టరేట్‌లో మంత్రులకు స్వాగతం పలికేందుకు వేచి చూస్తూ మంత్రుల కాన్వాయి సైతం అక్కడే ఉండగా వారికి సమాచారం లేకుండానే హెలిక్యాప్టర్‌ను గిరిరాజ్ కళాశాలలో దింపడంతో రైతులు, అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు లేకుండా హెలిక్యాప్టర్ దించడంతో దుమ్మూధూళితో రైతులు, అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి సమాచారం లేకుండా అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే హెలిక్యాప్టర్ గిరిరాజ్ కళాశాల మైదానంలో దిగినట్లు తెలుస్తోంది. తర్వాత హెలిక్యాప్టర్‌ను కలెక్టరేట్ హెలి ప్యాడ్‌కు తీసుకువెళ్లి తిరుగు ప్రయాణంలో మంత్రులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



హెలిక్యాప్టర్ తాకిడికి పరుగులు పెడుతున్న అధికారులు, సిబ్బంది



రైతు మహోత్సవంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన రైతులు



చెరకు వంగడాలను వివరిస్తున్న ప్రతినిధులు



వరి వంగడాలను వివరిస్తున్న జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రతినిధులు

ఆకట్టుకున్న స్టాళ్ల ప్రదర్శన

- కొత్త వంగడాలు, అధునాతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ రైతు మహోత్సవంలో వివిధ వ్యవసాయ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు, వివిధ కంపెనీల ప్రతినిధులు నూతన వ్యవసాయ పద్ధతులు, యంత్రాల ద్వారా వ్యవసాయం, నూతన వంగడాలు, డ్రిప్ ఇరిగేషన్, కోళ్లు, మేకల పెంపకం, తదితర వివరాలను రైతులకు వివరించేందుకు వివిధ స్టాళ్లను ఏర్పాటు చేశారు. మొదటిరోజు రైతులు స్టాళ్ల వద్దకు వెళ్లి నూతన వ్యవసాయ పద్ధతుల గురించి వివరంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యమ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. చెరకు వంగడాలు చెరకు ద్వారా ఉత్పత్తి అయ్యే పదార్థాలను ప్రదర్శించారు. మోలాసిస్, పంచదారా, ఇథనాల్, స్పిరిట్, తదితర పదార్థాలను చెరకు ద్వారా ఎలా తయారు చేసుకోవాలో అదే విధంగా చెరకులో అంతర్‌పంటలు మొక్క మొదళ్లలో మట్టి ఎగదోలుట, చెరకు ఆకు రెలచి నేలమీద కప్పుట, జడ చుట్టు వేయుట, చెరకు నరుకు యంత్రం తదితర వివరాలను రైతులకు వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో అధిక దిగుబడి మరియ రాబడికి ఏఏ వంగడాలను వాడాలో వివరించారు. జగిత్యాల వరి అదేవిధంగా, నూతన సాంకేతిక పరిజ్ఞానం, స్వయం ఉపాధి, పసుపు విస్తీర్ణం, పసుపు రకాలు, తదితర వివరాలను స్టాల్స్ ద్వారా వివరించాయి. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కలిగే లాభాలను ఉద్యానవన శాఖ ద్వారా అందిస్తున్న రాయితీలను వివరిస్తూ ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ, జైన్ ఇరిగేషన్ సిస్టమ్ ఆధ్వర్యంలో స్టాల్స్ ప్రదర్శన ద్వారా రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులను వివరించారు. అదేవిధంగా ఆయిల్‌పామ్ ద్వారా కలిగే లాభాలను ఆయిల్ పామ్ ద్వారా ఉత్పత్తి అయ్యే పదార్థాలను ప్రదర్శించారు. ఆధునిక యంత్రాలతో పాటు యంత్రాలకు గల సబ్సిడీని వివరిస్తూ స్టాల్స్ ప్రదర్శన చేశారు. కామారెడ్డి పీ వీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, కాలేజీ ఆఫ్ డైరీ టెక్నాలజీ ఆధ్వర్యంలో బటర్, పన్నీర్, లస్సీ, తదితర ఆహార పదార్థాలను ఏవిధంగా తయారు చేస్తారో వివరించారు.



డ్రిప్ ఇరిగేషన్ గురించి వివరిస్తున్న అధికారులు



పామాయిల్ పంట గురించి వివరిస్తున్న ప్రతినిధులు



యంత్రాల ప్రదర్శన



పన్నీర్, లస్సీ, బట్టర్ తయారీని వివరిస్తున్న పీవీనర్సింహారావు వెటర్నరీ, డెయిరీ టెక్నాలజీ విద్యార్థులు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన మానిటరింగ్ అధికారి



ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న అధికారి

లింగంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మానిటరింగ్ అధికారి రాధిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఏర్పాటుచేసిన వసతులపై ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో టెంట్‌తోపాటు, మంచి నీరు, విద్యుత్, 10 వరకు టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచినట్లు రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అసౌకర్యం లేదని తెలిపారు. ధాన్యం తూకం వేయడం వేగవంతం చేయాలని రైతులు కోరారు. దీంతో ఆమె తూకం వేగవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ దేవెందర్‌రెడ్డిని కోరారు. గన్నీ బ్యాగులు సైతం కావాల్సినన్ని అందుబాటులో ఉన్నాయని 10 రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని చైర్మన్ పేర్కొన్నారు. ఆమెవెంట చైర్మన్ దేవెందర్‌రెడ్డి, సీఈవో పెంటయ్య, సిబ్బంది పురుషోత్తమ్, దుర్గ ప్రసాద్‌లతో పాటు రైతులు సల్ల మల్లయ్య. రాములు, రైతులు ఉన్నారు.

చలువ పందిళ్లే బస్టాండ్‌లు!

- భిక్కనూరులోని జాతీయ రహదారిపై ఎండకు, వానకు ప్రయాణికులకు ఆవే ఆధారం
- బస్టాండ్‌లు లేక చలువ పందిళ్లను ఏర్పాటు చేసిన యువకులు
- ప్రజలకు ఉపయోగపడే స్థలంలో ప్రయాణ ప్రాంగణాలను నిర్మించాలని కోరుతున్న గ్రామ ప్రజలు

జర దేఖో!!



బస్వాపూర్ వద్ద చలువ పందిరి ఏర్పాటు చేసిన దృశ్యం



సిద్దరామేశ్వరనగర్ వద్ద ఇలా..

భిక్కనూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామాలకు చలువ పందిళ్లే బస్టాండ్‌లు. ఎండైనా, వానైనా ప్రయాణికులకు అవే ఆధారం. 44వ జాతీయరహదారిని ఆనుకుని ఉన్న భిక్కనూరు మండలంలోని సిద్దరామేశ్వర నగర్ గ్రామాల్లో బస్టాండ్‌లు లేక ఆయా గ్రామాల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దింతో చేసేదేమి లేక ఎండైనా, వానైనా రోడ్డుపైనే బస్సుల కోసం నిలబడాల్సి పరిస్థితి నెలకొంది. ఇటీవల ఆయా గ్రామాల యువకులు వారి గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి వారే ఆయాగ్రామాల వద్ద చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు చెందిన మరికొందరు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. బస్టాండ్‌లు లేకపోవడంతో రోడ్లపై బస్సుల కోసం ప్రయాణీకులు నిలబడుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రిసమయంలో బస్సుల కోసం రోడ్డుపై నిలబడటంతో భద్రత సమస్యలు తలెత్తుతున్నాయి. రోడ్డుపై బస్సులు నిలపడానికి సైతం స్థలం అనువుగా లేకపోవడంతో బస్సు డ్రైవర్లు సైతం అక్కడా బస్సులను ఆపడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ కానీ సంబంధిత అధికారులు కానీ పట్టించుకుని ఆయాగ్రామాల్లో సర్వీస్‌రోడ్లను, బస్టాండ్‌లను నిర్మించాలని ఆయాగ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఏ కాలమైనా ప్రయాణికులకు ఇబ్బందులే..

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బస్వాపూర్ గ్రామంలో కామారెడ్డివైపు, సిద్దరామేశ్వరనగర్‌లో రెండువైపుల ఆయా గ్రామాల యువకులు ఈ చలువ పందిర్లను ఏర్పాటుచేశారు. సిద్దరామేశ్వర నగర్ గ్రామంలో ఆశుశ్రీ యూట్యూబ్ చానెల్ ప్రతినిధులు, బస్వాపూర్ గ్రామంలో యూత్ ఫర్ యూనిటీ ప్రతినిధులు ఈ చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రజలకు ఎండకు, వానకు ఈ చలవ పందిర్లే ఆధారమయ్యాయి. తాము బస్టాండ్‌లు లేక ఇంత ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎవరు పట్టించుకోవడం లేదని ఆయాగ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండ్‌లు నిర్మించాలని వినతులు

44వ జాతియ రహదారిని డబుల్ రోడ్డుగా నిర్మించే సమయంలో సిద్దరామేశ్వరనగర్ వద్ద కాకుండా పెద్దమల్లారెడ్డి ఎక్స్ రోడ్డు వద్ద ఇరువైపులా బస్టాండ్‌లను, బ్రిడ్జిని, సర్వీస్‌రోడ్డును నిర్మించారు. అక్కడ నిర్మించిన బస్టాండ్‌లు ఈ గ్రామస్థులకు దాదాపు కిలోమీటరు దూరంలో ఉండటంతో ప్రస్తుతం ఆ బస్టాండ్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామస్థులకు అందుబాటులో ఈ బస్టాండ్‌లు లేకపోవడంతో ఈ గ్రామప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో కామారెడ్డి వైపు జాతీయ రహదారిని ఆనుకుని సర్వీస్‌రోడ్డు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో ఈ వైపు బస్టాండ్‌ను నిర్మించలేదు. ఈ విషయమై జీఎంఆర్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్, ప్రస్తుత ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఆయాగ్రామాల ప్రజలు ఎన్నిసార్లు విన్నవించిన సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయాగ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా బస్టాండ్‌లను నిర్మించడంతో పాటుగా ఆయా సౌకర్యాలను కల్పించాలని ఆయాగ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఫొటో న్యూస్



ఆకులు రాలి మొడుగా రావిచెట్టు



రెండోవారం కాయలతో..

ఒక్కో వారం ఒక్కో రూపం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని రావి చెట్టు చూపరులకు ఆకర్శిస్తోంది. ఆకురాలే సమయంలో చెట్టుకున్న ఆకులన్నీ రాలి పోయి ఎండిన మోడును తలపించిన చెట్టు ఒక్కో వారం ఒక్కో రూపం దాల్చుతోంది. తొలిసారి చెట్టుకు కాయల లాంటివి కనిపించగా.. రెండో వారం లేతాకులు దర్శనమిచ్చాయి. మూడోవారం బంగారు వర్ణంతో చెట్టు కళకళలాడింది. తదుపరి వారం ఆకుపచ్చ వర్ణంతో ఆకులు పెరిగి ప్రస్తుతం వేసవిలో ఎంతో మందికి నీడనిస్తోంది.



మూడో వారం లేత ఆకులతో..



నాల్గోవారం నిండుగా నీడనిస్తూ..

జొన్నరొట్టెతో ఆరోగ్యం పదిలం

- వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధం
- ఇష్టంగా తింటున్న ప్రజలు
- రొట్టెల తయారీతో మహిళలకు ఉపాధి

బాన్సువాడటౌన్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): జొన్నరొట్టెతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మన పూర్వీకుల నుంచి వస్తున్న నమ్మకం. ఒకపుడు ఇది కేవలం పేదల ఆహారంగా ఉండేది. అందరూ అన్నం తినడం అలవాటు చేసుకోవడంతో క్రమేనా జొన్నరొట్టెల వినియోగం తగ్గింది. కొంతమ ంది చాలా సంవత్సరాలుగా అన్నానికి బదులుగా జొన్నరొట్టెను తినడంతో వారు ఆరోగ్యంగా ఉంటున్నారు. ప్రస్తుతం అందరూ కూడా జంక్ ఫుడ్ తినడానికి అలవాటు పడుతున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. నాసిరకమైన నూనెలు, రసాయనాలు కలిపిన వంట పదార్థాలను తిని ప్రజలు తమ ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. మారుతున్న కాలం, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రజలు తిరిగి సంప్రదాయ ఆహారం తినడానికి ఆసక్తి చూపుతున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం జొన్నరొట్టెలు తింటూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారు.

వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధం

జొన్నరొట్టె వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధంలా పని చేస్తోంది. పోషకాలు సమృద్ధిగా కలిగిన ఆహారంగా జొన్నరొట్టె ప్రత్యేకత. మధుమేహం ఉన్నవారికి ఇది చక్కని భోజనం. 100 గ్రాముల జొన్నలో 10.4 గ్రాముల ప్రోటీన్లు ఉంటాయి. మానవ శరీరానికి ప్రతీ రోజు అవసరమైన



ఫైబర్ జొన్నరొట్టె అందిస్తుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. జొన్నలో ఐరన్, కాల్షియం, విటమిన్ బీ, మినరల్స్ వంటివి ఉన్నాయి. జొన్నరొట్టె తినడంతో బరువు తగ్గడం, జీర్ణక్రియ మెరుగు పడడం, గ్యాస్ వంటి సమస్యలకు చెక్‌పెట్టవచ్చు.

ఉపాధి పొందుతున్న మహిళలు

జొన్నరొట్టెల తయారీతో మహిళలు ఉపాధి పొందుతున్నారు. బాన్సువాడ పట్టణంలో సాయంత్రం సుమారు 8 దుకాణాలలో మహిళలు జొన్నరొట్టెలను తయారు చేసి వి క్రయిస్తారు. ఇళ్లలో, బండిపై, దుకాణాలలో మహిళలు ప్రతీ రోజు ఒక్కొక్కరు 50కి పైగా జొన్నరొట్టెలను తయారు చేస్తారు. ఒక్క జొన్నరొట్టె 15 రూపాయలకు విక్రయిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. మొత్తానికి జొన్నరొట్టె అటు ఆరోగ్యం, ఇటు ఉపాధి కల్పిస్తోంది.

CLASSIFIEDS

WANTED

REQUIRED SPECIFIC COMPUTER OPERATORS FOR GRAPHIC DESIGNER. NO OF POST 04. CONT: ORANGE XEROX, NIZAMABAD, CELL: 9177555105

AJZ

CHANGE OF NAME

I, VANGA SHREESHA (OLD NAME) R/O H.NO: 1-1-88, NEAR SHOE TOWN, VINAYAK NAGAR, NIZAMABAD, TS. I HAVE CHANGED MY NAME AS ALASANI SHIREESHA REDDY (NEW NAME) W/O ALASANI MADHUSUDHAN REDDY

AJZ

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి
దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు...
క్లాసిఫైడ్స్
ప్రతి 4 లైన్లకు 190/- అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453


ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ దిలీప్‌కుమార్ టౌన్‌ప్లానింగ్ అధికారులతో పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా వెనువెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్లాట్ల యజమానులతో ఎల్ఆర్ఎస్ చెల్లించాల్సిన అవసరం గురించి తెలియజేయాలని ఎల్ఆర్ఎస్ పథకం యొక్క ప్రయోజనాలను వివరించాలని కోరారు. ప్రజల ఫిర్యాదును రోజువారిగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన స్లాబ్ కల్వర్టు

పోత్నూర్ వద్ద దెబ్బతిన్న వంతెన, శిథిలావస్థకు చేరిన వంతెన

సిరికొండ ఎప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పోత్నూర్ నుంచి భీమ్‌గల్ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై నాలుగైదు దశాబ్దాల క్రితం నిర్మించిన స్లాబ్ కల్వర్టు శిథిలావస్థకు చేరిందని దానిని పునర్నించాలని ప్రయాణికులు ప్రభుత్వాన్ని కోరుతన్నారు.పోత్నూర్ వైకుంఠధామం వద్ద గల స్లాబ్ కల్వర్టు కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించారు. గత కొన్ని ఏళ్లుగా కల్వర్టుపై భాగం దెబ్బతింటున్నది, అక్కడ తారు రోడ్డు సైతం పదే పదే దెబ్బ తింటున్నాది, దెబ్బతిన్న చోట ఎన్ని సార్లు తారు వేసిన ఆగడం లేదని స్థానికులు చెపుతున్నారు.స్లాబ్ కల్వర్టు కింది భాగంలో కూడ బీటలు వారింది.కూలీ పోవడానికి సిద్ధమన్నట్లు తయారయ్యింది. వర్షాకాలంలో కల్వర్టుపై భాగంలో వర్షపు నీళ్లు నిలుస్తాయి.కిందా కూడ చెరువు నీళ్లు వచ్చి ఆగుతాయి. దీనివల్ల కల్వర్టు శిథిలావస్థకు చేరిపోయిందని పోత్నూర్ గ్రామస్తులు చెపుతున్నారు.కల్వర్టు కూలి పోకముందే రోడ్డు భవనాలశాఖ ఇంజనీరింగ్ అధికారులు తేరుకుని నూతన కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరు తున్నారు.

అధిక దిగుబడి వచ్చే వంగడాలను ఎంచుకోండి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నందిపేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):అధిక దిగుబడి ఎక్కువ రాబడి వచ్చే వంగడాలను ఎంచుకోవాలని సిరి కంపెనీ అధికారి రంజిత్‌కుమార్ అన్నారు. నందిపేట మండలం వన్నెల్(కె) గ్రామంలో సిరి సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటపై అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మన్నిక కలిగిన విత్తనాలను ఎంచుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో రైతులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

25 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):25 సంవత్సరాలకు ముందు 1999-2000 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులంతా సోమవారం ఒక్కచోట చేరి సందడి చేశారు. ఈ అపూర్వ పూర్వ విద్యార్థుల కలయికకు నగర శివారులోని జిల్లా వంజరి సంఘం వేదికైంది. మాక్లూర్ మండలం మామిడిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 1999-2000 సంవత్సరం పదోతరగతి విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఒక్కచోట చేరి సందడి చేశారు. తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, దయానంద్‌రెడ్డి, సుగుణ, తదితరులను ఘనంగా సన్మానించుకున్నారు.ఈకార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సత్యనారా యణ, అనంత్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు. గురువులకు పాదాభివంద నలు చేస్తూ ఆనాటి మధుర జ్ఞాపకాలను స్మరించుకుంటూ సందడి చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బోధన్‌రూరల్,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 1992-93 7వ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం గ్రామంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మరిచిపోని సన్నివేశాలను నెమరువేసుకున్నారు. ఉద్యోగరీత్యా వివాహలు చేసుకుని దూర ప్రాంతాలలో సైతం స్థిరపడినప్పటికీ తన చిన్ననాటి తరగతిలో చదువు అభ్యసించిన సన్నివేశాలను చిలిపిచేష్టాలు చేసుకున్న సందర్భాలను గుర్తు చేసుకున్నారు. 33సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత విద్యార్థిని, విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయతను పంచుకున్నారు. సహపంక్తి భోజనం చేశారు. ఎవరెవరు ఏ స్థాయిలో స్థిరపడినప్పటికీ ఒకరిఒకరం సోదరభావంతో ఉంటూ సహయ సహకారాలు తీసుకుంటూ తోడునీడగా ఉందామన్న సంకల్పం వారి ఆత్మీయతలో కళ్లను కట్టింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రైతులు అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు మహోత్సవంలో వివిధ అంశాలపై రైతులకు విస్తృతస్థాయి అవగాహన కల్పిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. తొలిరోజైన సోమవారం పసుపుసాగులో మెలకువలు, ఆదర్శ రైతుల అనుభవాలు, చెరకు సాగులో అవరోధాలను ఎలా అధిగమించాలి, ఆయిల్ ఫామ్ సాగులో సమకూరే ప్రయోజనాలు, వరిపంటలో మేలు రకాలు, నిర్ణీత సమయంలో పంట విత్తుకోకపోతే కలిగే నష్టాలు, మొక్కజొన్న పంట సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు, సుగంధ ద్రవ్యాల సాగు, వాటి ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు అవగాహన కల్పించగా ఆదర్శ రైతులు తమ అనుభవాలను వివరిస్తూ రైతులలో ఆసక్తిని పెంపొందించేలా చేశారని కలెక్టర్ తెలిపారు.

● నేటి అవగాహన కార్యక్రమాల వివరాలు

రైతు మహోత్సవంలో భాగంగా ఈనెల 22 మంగళవారం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 10.30ల వరకు నాణ్యమైన పసుపు పంట పద్దతులపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.మనోహర్‌రావు రైతులకు అవగాహన కల్పిస్తారని, 10.30ల నుంచి 10.45 వరకు మామిడి, ఇతర పండ్ల తోటల పెంపకం పై సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ పి.హరికాంత్ అవగాహన కల్పిస్తారని, 10.45 నుంచి 11.15 వరకు ఆయిల్ ఫామ్ సాగుపై శాస్త్రవేత్తల నర్సింహారావు, 11.15 నుంచి 11.30 వరకు ఆదర్శ రైతు సుభాష్ తను అనుభవాలను, 11.30 నుంచి 12.00ల వరకు సేంద్రియ పంటల సాగుపై మంచిర్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ శివకుమార్, 12.00 నుంచి 12.15 వరకు ఆదర్శ రైతు సోమరాజిరెడ్డి తన అనుభవాలను, 12.15 నుంచి 12.45 వరకు సోయాబిన్, పత్తిపంటల సాగులో మెలకువలను ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, 12.45 నుంచి 1గంట వరకు ఆదర్శ రైతు బాల్‌కిషన్ తన అనుభవాలను వివరిస్తారని అన్నారు. భోజనం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 2.30 వరకు పశువుల మేత నిర్వాహణ అంశాలపై డాక్టర్ నితీష్‌వర్మ, 2.30 నుంచి 2.45 వరకు ఆదర్శ రైతు గంగారాం కూరగాయల సాగుపై, 2.45 నుంచి 3.15 వరకు డైరీ నిర్వాహణపై ఆకుల పాపయ్య, 3.15 నుంచి 3.30 వరకు ఆయిల్ ఫామ్, పసుపు సాగుపై డి.గంగారెడ్డి, 3.30 నుంచి 4గంటల వరకు ప్రధానమంత్రి మత్స్యసంపద పథకం గురించి మత్స్యశాఖ అధికారి ఆంజనేయులు, 4 గంటల నుంచి 4.15 వరకు స్పాన్ పెంపకం పై ఆదర్శ రైతు గోపాల్, 4.15 నుంచి 4.45 వరకు మిర్చీ పంటపై శాస్త్రవేత్త నాగరాజు, 4.45 నుంచి 5గంటల వరకు కూరగాయల సాగుపై ఆదర్శ రైతు నాగపోతరావు అవగాహన కల్పిస్తారని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

● ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ

గిరిరాజ్‌కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రైతు మహోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ పరిశీలించారు. ఈనెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో ఐదు జిల్లాల నుంచి రైతులు, శాస్త్రవే త్తలుహాజరు కానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీకాంత్ బాబుకు వీడ్కోలు

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):వసంత కాలంలో వివిధ ఋతువులు ఉన్నట్లు న్యాయవ్యవస్థలో ఏప్రిల్ నెలలో బదిలీల కాలం ఉంటుందని ఇన్‌చార్జీ జిల్లా ప్రధాన న్యాయాధికారి కనక దుర్గ తెలిపారు. నిజామాబాద్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు హైదరాబాద్ కు బదిలీ అయిన నేపథ్యంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వర్షా,చలి,వేసవి రుతువులు వచ్చినట్లు న్యాయమూర్తులకు బదిలీల కాలం వస్తుందని అది ఎప్రిల్ నేలలోనేని ఆమె చమత్కరించారు. కాలబార్ సమావేశపు హల్ ఎదరో నాయమూర్తులకు వీడ్కోలు పలికిన సమావేశ ౹మందిరమనిఆమె అభివర్ణించారు.బార్ అండ్ బెంచ్ అనే వ్యవస్థలు ఒకటేనని వేరుగా చూడలేమని అన్నారు. బదిలీపై రావడం,బదిలీపై వెళ్లడం ఉద్యోగరీత్యా బాధ్యతల బదిలీలేనని ఆమె తెలిపారు. శ్రీకాంత్ బాబు ను న్యాయవాదులందరు స్వంత ౹బాబులాగే ఆదరించి కోర్టు విధులు సాఫీగా సాగడానికి సహకరించారని జడ్జి కనక దుర్గ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జడ్జి శ్రీకాంత్ బాబు కోర్టు విధులలో అందరిని కలుపుకుని పోయిన వ్యక్తి అని ,వ్యవస్థ పనితీరుకు సరిపోయిన ,సరితూగినవారని అన్నారు.బార్ అధ్యక్షుడు మామిల్ల సాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి మానిక్ రాజు ల ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న జడ్జి శ్రీకాంత్ బాబు ను శాలువ,మెమోంటోతో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండున్నరేళ్ళు న్యాయవాదులను నొపించకుండా అందరి మన్ననలు చురగొన్న జడ్జిగా శ్రీకాంత్ బాబును పేర్కొన్నారు.బార్ అండ్ బెంచ్ ల గౌరవప్రతిష్టతలను కాపాడటంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ రాష్ట్రంలో నే అగ్రస్థానంలో ఉన్నదని వారు వెల్లడించారు. వీడ్కోలు కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు దిలీప్,సంయుక్త కార్యదర్శి ఝాన్సీరాణి, కోశాధికారి నారాయణ దాసు,లైబ్రరీ కార్యదర్శి శ్రీమాన్, కార్యవర్గ సభ్యులు అరేటి నారాయణ, సుజిత్ ,న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లు గా తెలంగాణ వర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు తెలంగాణ యూనివర్సిటీ లో కొనసాగుతున్న సమ్మెకు మాజీ జడ్పీటీసీ బీఆర్ఎస్ నాయకుడు బాజిరెడ్డి జగన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యూలరేజ్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో కల్పించి రెగ్యూలర్ అధ్యాపకులతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం బీఆర్ఎస్ పక్షాన పోరాటం చేస్తామని జగన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు దత్తహరి, గంగాకిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లు అందించాలి : ఐకేపీ మెప్మా

ఆర్మూర్ రూరల్ , ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి):రానున్న విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫామ్ (ఏకరూప దుస్తువులు) అందించాలని అధికారులు ఐకేపీ మెప్మా ప్రతినిధులకు సూచించారు. సోమవారం ఆర్మూర్‌లోని ఎంఈవో కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంపీడీవో సాయిరాం,ఎంఈవో విద్యార్థుల ఏకరూప దుస్తువుల కోసం క్లాత్‌మెటీరి యల్‌ను ఐకేపీ మెప్మా ప్రతినిధులకు స్టిచింగ్ నిమిత్తం అందజేశారు. 52 పాఠశాలలకుగాను 4907మీటర్ల క్లాత్ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీఏపీఎం గంగారాం, మెప్మా కోఆర్డినేటర్ ఉదయశ్రీ పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతుభరోసాపై మంత్రుల అబద్ధాలు

● మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):రుణమాఫీ, రైతు భరోసాపై రాష్ట్ర మంత్రులు అబద్దాలు చెబుతున్నారని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగంలో తెలంగాణ రైతులు దేశానికే రోల్‌మోడల్ అన్నారు. సాగు పాఠాలు నేర్పడం తప్ప నేర్చుకునే స్థితిలో జిల్లా రైతులు లేరన్నారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో రైతులకు చేయని సాయం చేసినట్లుగా మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్‌కుమార్‌లు మాట్లాడుతున్నారని అన్నారు. మంత్రుల అబద్దాలకు హద్దు లేకుండాపోయిందని అన్నారు. ఓటేసిన పాపానికి రైతులను కాంగ్రెస్ నట్టెట్ట ముంచిందని మండిపడ్డారు. కేసీఆర్ పదేళ్ల పాలన రైతులకు వరమని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, పంట కొనుగోలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల పంపిణీ వంటి చర్యలతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగం కలకలలాడిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రావడంతో మసకబారిపోయిందని అన్నారు.

సబ్జెక్టు రిసోర్స్‌పర్సన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మండల, జిల్లాస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు సబ్జెక్టు రిసోర్స్‌పర్సన్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మండల, జిల్లాస్థాయిలో శిక్షణ ఇవ్వడానికి కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ద్వారా వచ్చిన దరఖాస్తుల నుంచి అర్హత కలిగిన వారిని నియమించడం జరుగుతుందని మండల స్థాయి రిసోర్స్‌పర్సన్ల కోసం 8 సంవత్సరాల అనుభవం, డిస్ట్రిక్ స్థాయి రిసోర్స్‌పర్సన్ల కొరకు 10 సంవత్సరాల అనుభవం కలిగిన వారు, ఉర్దూ మీడియం 4 సంవత్సరాల అనుభవం కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు డీఈవో నిజామాబాద్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అర్హత కలిగిన వారు మండల రిసోర్స్‌పర్సన్ ఎంపిక కొరకు మండల విద్యాశాఖ అధికారికి,జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్ కొరకు జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షా కార్యాలయంలో ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న నస్రిన్, రఫత్, శారదతో పాటు పంచాయతీ కార్యదర్శి గంగారాం బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీయూ పరిధిలో డిగ్రీ పరీక్షలు వాయిదా

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):తెలంగాణ వర్సిటీ పరిధిలోని ఈనెల 28నుంచి జరగాల్సిన డిగ్రీ 2,4,6వ రెగ్యూలర్ సెమిస్టర్ 1,3,5 సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు వాయిదా వేయడం జరిగిందని పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.సంపత్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాని సూచించారు.

23న మండలంలో ఎమ్మెల్యే పర్యటన

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని 6గ్రామాల్లో ఈ నెల 23న పలు అభివృద్ధి పనులకు, శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి చేయనున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మిట్టపల్లి,రాంపూర్, నర్సింగపూర్,కమలపూర్, ఖిల్లా డిచ్‌పల్లి, దూస్‌గాం, ఘన్‌పూర్ లలో ఎమ్మెల్యే అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

బీజేపీ కార్యకర్తకు నాయకుల పరామర్శ



మాట్లాడుతున్న నాయకులు

కోటగిరి,ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రానికి చెందిన సీనియర్ బీజేపీ కార్యకర్త ధర్మారం వెంకటేష్ అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు సోమవారం ఆసుపత్రికి వెళ్లి వెంకటేష్‌ను పరామర్శించారు. ఆయనను పరామర్శించిన వారిలో హరికృష్ణ, ప్రశాంత్‌గౌడ్, గజేందర్,రామరాజ్ తదితరులున్నారు.

సెంట్రల్ లైట్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిబ్బందికి సూచించిన మండల స్పెషల్ ఆఫీసర్ యోహాన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి-నిజామాబాద్ ప్రధాన రోడ్డు మధ్యలో గల సెంట్రల్ లైటింగ్ పగలు వెలగడం రాత్రి సమయాల్లో వెలగకపో వడంతో ఆంధ్రజ్యోతి సోమవారం జిల్లా ఎడిషనల్‌లో పగలే వెన్నెలాయి అనే వార్త ప్రచురితం కావడంతో మండల స్పెషల్ ఆఫీసర్ యోహన్ స్పందించి పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. వెంటనే సెంట్రల్ లైటింగ్‌ను మరమ్మ తులు చేయాలని ఆయన ఆదేశించారు.

వంట సామగ్రి అందజేత



వంట సామగ్రిని అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వంట సామగ్రిని అందజేశారు. సోమవారం గూపన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వంటసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో విద్యకు ఎలాంటి నిధులు కేటాయించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యకు తగిన ప్రాధాన్యత ఇస్తు బడ్జెట్ కేటాయిస్తున్నామని ఇది ఖర్చు మాత్రం కాదని విద్యార్థులపై పెట్టే పెట్టుబడి అని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చేరే విధంగా ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కుదిరేలా వ్యవహరించాలని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను బావిభారత పౌరులుగా మార్చాలని ఆయన ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారని ఇంకా ఎందరో మహానుబావులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ప్రయోజకులుగా ఉన్నారని అన్నారు. విద్యార్థులు ఏఏ రంగాల్లో చురుగ్గా ఉన్నారో గుర్తించి ఆయా రంగాల్లో వారికి నైపుణ్యం కలిగించి వారికి తగిన సూచనలు ఇస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలిచేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రైవేటు పాఠశాలల్లో ఉండవని ఆయన అన్నారు. తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పిస్తూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 8 నుంచి 9 శాతం కేవలం విద్యకు 22వేల కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్, బాపూజీ కన్న కలలు విద్యతోనే సాధ్యమవుతాయని ఆయన అన్నారు. నాణ్యమైన విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని ఆయన అన్నారు. అంగన్‌వాడి, ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం కలిగిస్తూ నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రైమరీ స్కూళ్లను ఒకే దగ్గర చదువుకునే విధంగా ఏర్పాట్లు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎంఈవో, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ఒన్నాజీపేట సమీపంలో చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ధర్పల్లి/సిరికొండ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఒన్నాజీపేట్ గ్రామ శివారులోగల కార్నర్ తండా వద్ద ఆర్మూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రమాదం తృటిలో తప్పింది. బస్సులో 16 మంది ప్రయాణిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం కార్నర్ తండా వద్దకు రాగానే సాంకేతిక సమస్య తలెత్తడంతో బస్సును చెట్టుకు ఢీకొట్టి రోడ్డు కిందికి దిగింది. ప్రయాణికు లంతా సురక్షితంగానే ఉన్నారని ఆర్మూర్ డిపో సీఐ తెలిపారు. కాగా బస్సు చల్లగరిగె వద్దనే చిన్న ప్రమాదం జరుగగా డ్రైవర్ పక్కన ఉన్న అద్దం పగిలినట్లు ప్రయాణికులు తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరపరాకు అంతరాయం ఏర్పడుతుందని నగరటౌన్-1 ఏడిఈ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పద్మనగర్ రోడ్, హనుమాన్ నగర్, యాదగిరి బాగ్, కోటగల్లి, జెండాగల్లి, ఆర్యసమాజ్, గడీబజార్, దోబిగాట్, గోసంగి కాలనీ, శివాలయం,తెలంగాణతల్లివిగ్రహం, 100పీట్ల రోడ్డు, ఆకుల పాపన్న రోడ్, గణేష్ కాలనీ, అశోక్ అపార్ట్‌మెంట్, సాయి కృపనగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరపరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉదయం 9.30ల నుంచి 12.30ల వరకు విద్యుత్ సర ఫరాలో అంతరా యం ఏర్పడు తుందని విద్యుత్ వినియోగదా రులు సహకరించాలని కోరారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nirmal Branch, Dist. Nirmal agreed to accord Loan to Macha Giridhar S/o Gangaram, Aged 40 Yrs, Occ:Business, R/o H.No.2-15, Tadpakal Village, Yergatla Mandal, Nizamabad (Dist) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within (7) days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

SCHEDULE OF THE PROPERTY

The open place of belongs to H.No.1-81 part admeasuring total site area 2561.67 Sq.fts, equal to 284.63 Sq.yds or 237.98 Sq.mtrs property situated at Tadpakal Village of Yergatla Mandal, Nizamabad District, Grampanchayat Tadpakal, Mandal Parishad Yergatla, Zilla Parishad Nizamabad Registration Sub. Dist Bheemgal, Registration Dist. Nizamabad.

As Bounded by

North : G.P C.C Road, South : House of Kadar Jamal, East : House of Mangali Gangaram & Sayanna, West : Remaining House No. 1-81 Part of Macha Ganesh

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB.,Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97400	రూ.89,000	రూ.1020

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ఓదెల-2 (10.00, 1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-3 : పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (11.05)
: జాట్ (హిందీ) (1.30)
: సిన్నర్స్ (ఇంగ్లీష్) (4.40, 7.40, 10.40)
స్క్రీన్-4 : డియర్ ఉమా (11.00)
: ది చూసెన్ లాస్ట్ సుప్పర్ (ఇంగ్లీష్) (2.10, 7.40)
: జాక్ (4.45)
: పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓదెల-2 (10.40, 1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-2 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.00, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-3 : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.00, 10.40)
: ఒక్కడు (1.40, 7.40)

లలితామహాల్ : జాక్ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాట్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఓదెల-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్